క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలి

మంత్రికి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



కమలాపూర్ : మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి, బస్టాండ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు వెంటనే మంజూరు చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



వేలేరు : ఎస్సైగా అజ్మీరా సురేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. అక్రమ వ్యాపారంపై ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపుతామని అన్నారు. కాగా ఇక్కడ పనిచేసిన ఎస్సై డి.హరిత సుబేదారి పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

మల్లన్న ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు



ఐనవోలు : మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నిత్యపూజల అనంతరం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, స్వామివారి కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఒగ్గు పూజారులతో పెద్దపట్నం వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేదపండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన మౌటం రాజేశ్ ఇటీవల చేపల వేటకు వెళ్లి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) నాయకులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. ఈ సొమ్మును రాజేశ్ పిల్లల పేరిట పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేయనున్నట్లు మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. రాజేశ్ పిల్లల భవిష్యత్ కోసం, చదువుల కోసం సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మెపా రాష్ట్ర కార్యదర్శులు దండు చిరంజీవి, సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు రావుల రాణాప్రతాప్, ప్రధానకార్యదర్శి అమ్మగారి శ్యామ్, కమలాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు మౌటం సుభాశ్, గ్రామ పెద్దలు మౌటం జయశంకర్, పిట్టల రవి, నాయకులు మౌటం శ్రీనివాస్, మౌటం కుమారస్వామి, మౌటం తిరుపతి, మౌటం భిక్షపతి, మౌటం చిరంజీవి, మౌటం సాంబమూర్తి, మౌటం సుధాకర్, మౌటం రాజు, చరణ్, సాంబమూర్తి, చేరాలు పాల్గొన్నారు.

డీడీఎంను కలిసిన మార్కెట్ అధికారులు

వరంగల్: వరంగల్ మార్కెటింగ్ శాఖ డీడీఎంగా బాధ్యతలు చేపట్టిన పద్మావతిని మార్కెట్ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి నిర్మల, గ్రేడ్ -2 కార్యదర్శి రాము, బదిలీపై వెళ్తున్న జేడీఎం మల్లేషం, డీడీఎం రాజునాయక్, డీఎంఓ ప్రసాదరావు, యూనియన్ నాయకులు జన్ను భాస్కర్, కృష్ణమీనన్, రాజేందర్, శ్రీనివాస్, లాషరీఫ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

విద్యారణ్యపురి: భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను హనుమకొండలోని ప్రభుత్వ పింగళి మహిళా కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య చిత్రపటానికి ప్రిన్సిపాల్, లెఫ్టినెంట్ డాక్టర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను జయప్రదం చేయాలి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్



కమలాపూర్ : సమావేశంలో మాట్లాడుతున్న రాంరెడ్డి

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 నుంచి 9వ తేదీన వరకు చేపట్టనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆగస్టు 5నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు, స్వయం సహాయక సంఘాలు, యువజన, వార్డు కమిటీ సభ్యులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అలాగే గ్రామస్తులు ఇంటిలో చెత్తను వేరు చేయడం, గృహాలనుంచి వేరు చేసిన వ్యర్థాలను సేకరంచి కాంపోస్టు ఉత్పత్తి చేయాలని, దానిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. పారిశుద్ధ్యం, తోటల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వీరేశం, ఎంపీఓ నాగరాజు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గుండె బాబుతో కలిసి శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, ఆశ కార్యకర్తలు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థాయిలో అన్ని శాఖల అధికారులు, ఎన్జీఓలు, యువకులు, గ్రామస్తులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, మండల పరిషత్ సూపరిండెంట్ కరణ్‌సింగ్, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

● డీఆర్‌డీఓ నాగపద్మజ



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

నడికూడ : విధుల్లో అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ నాగపద్మజ, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నూతన గ్రామపంచాయతీ భవనం ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మూడో విడత సామజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం ద్వారా 2023 ఏప్రిల్ -2024 మార్చి వరకు రూ.2 కోట్ల 36 లక్షల పైచిలుకు జరిగిన పనుల పై సామాజిక తనిఖీ నిర్వహించారు. సమగ్ర సమాచారంపై మండల ఇన్‌హౌస్ వేదిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. చౌటుపర్తి, రాయపర్తి, పులిగిల్ల, కౌకొండ, చర్లపల్లి, వెంకటేశ్వర్లపల్లి సంబంధిత గ్రామ పంచాయతీ ఉపాధీ హామీ అధికారుల నుంచి రూ.42,220 రికవరీ చేయనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులో కలిసి సమన్వయంతో పని చేయాలని, రికార్డులో తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వివరాల సేకరణలో తప్పులు చేసిన వారికి జరిమానా విధించారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ సాగరిక, డీటీసీ శ్రీధర్, ప్లాంటేషన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓలు విద్యావతి, ఏపీసీ అంజన్‌రావు, ఎస్ఆర్‌పీ కొమురయ్య, ఈసీ రజినీకాంత్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గులాబీరంగు పురుగును నివారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ఐనవోలు : పత్తి చేనులో వచ్చే గులాబీరంగు పురుగును నివారించేందుకు రైతులు తగు మెళకువలు పాటించాలని నాట్కో కంపెనీ ప్రతినిధులు సూచించారు. ఈ మేరకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి అడప కవిత, కంపెనీ ప్రతినిధులు ఒంటిమామిడిపల్లి గ్రామంలోని పంటక్షేత్రాన్ని పరిశీలించారు. నాట్కో కంపెనీ నూతనంగా మార్కెట్‌లోకి తీసుకొచ్చిన నాట్‌మెట్ పీబీడబ్ల్యూ పేస్ట్ వినియోగం గురించి వివరించారు. రైతులకు చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని అన్నారు. కంపెనీ ప్రతినిధులు జీఎం రాంమోహన్‌రావు, ఆర్బీఎం శ్రీధర్, ఏఎంఎం సుధీర్, టీబీఎం రంజిత్, పీడీ రామకోటి, డిస్ట్రిబ్యూటర్ ఎలేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ



శాయంపేట : మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



దామెర : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శాయంపేట : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని బీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇచ్చిన సందర్భంగా మండలంలోని కొప్పుల, శాయంపేట గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్వీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 30ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో దండోరా ఉద్యమంతో చేపట్టిన ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు సంతోషకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన మొదటి అసెంబ్లీ సమావేశంలో సీఎం కేసీఆర్ తీర్మాణం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు శివ, మాజీ ఎంపీటీసీ విజయ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు భాస్కర్, దేవయ్య, రాజయ్య, సదయ్య, ప్రవీణ్, విజయ్, రమేశ్, క్రాంతి, కట్టయ్య, అశోక్, సుధాకర్, రాజయ్య పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవిందు రవికుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మండల నాయకులు శ్రీధర్, ప్రదీప్, మధు, రాజశేఖర్, సంపత్, యుగేందర్, ప్రేమ్‌కుమార్, చిరంజీవి, కిరణ్, కమలాకర్, జైపాల్, మహేశ్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూల తీర్పునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం మండలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి, అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రమోద్‌కుమార్, అర్షం వరుణ్‌గాంధీ, చిలువేరు భిక్షపతి, ప్రసంగి, కిరీటి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

'దండెపల్లిలో దొంగల బీభత్సం'

ఎల్కతుర్తి : మండలంలోని దండెపల్లిలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఎనిమిది తులాల బంగారంతో పాటు లక్ష నగదును చోరీ చేశారు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండెపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన కోదాటి ప్రమీల అనే వృద్ధురాలి ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరబడి బీరువాలోని లక్ష రూపాయల నగదుతో పాటుగా 8 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధిత వృద్ధురాలు పింఛన్ డబ్బులు తీసుకునేందుకు ఇంటికి తాళం వేసి కరీనంగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేలోగా తాళం ధ్వంసమై కనిపించింది. గమనించిన బాధితురాలు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అదే విధంగా కాజీపేట ఏసీపీ తిరుమల్ పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అపహరించుకుపోయిన మొత్తం విలువ రూ.4లక్షల 20వేలు ఉంటుందని పేర్కొన్నారు.

గొడ్డలితో దాడి

ఆత్మకూరు : స్థలం విషయంలో చోటుచేసుకున్న గొడవ గొడ్డలిగాటుకు దారి తీసింది. బాధితుల కథనం ప్రకారం.. పెంచికలపేటకు చెందిన ఉమ్మల్ల అరుణ ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకుని గోడలకు ప్లాస్టరింగ్ మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఇంటిపక్కన ఉండే ముదిగిరి రాజు స్థలం విషయంలో గొడవకు దిగాడు. అయితే 15 రోజుల క్రితం అరుణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత పెద్దమనుషులు మధ్య పంచాయతీ పెట్టగా ఇంటి పక్కన ఫీటు స్థలం ఉందని ప్లాస్టరింగ్ చేసుకోవచ్చని తెలిపారు. దీంతో ముదిగిరి రాజు శుక్రవారం సాయంత్రం అరుణతో పాటు ఆమె కుమారుడు సందీప్‌ను దూషిస్తూ ఇద్దరిపై దాడికి దిగాడు. సందీప్ తలపై గొడ్డలితో దాడి చేయగా తీవ్రగాయాలవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఎండు గంజాయి పట్టివేత

ఐనవోలు : ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని స్థానిక పోలీసులు పట్టుకున్న సంఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. టాస్క్‌ఫోర్స్, ఐనవోలు పోలీసులు సంయుక్తంగా మండల కేంద్రంలోని నంది సెంటర్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఆటోలో వచ్చిన కొండపర్తి గ్రామానికి చెందిన బుంగ కల్యాణ్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతన్ని పట్టుకుని ఆటో తనిఖీ చేయగా ఆటోలోని ప్లాస్టిక్ కవర్‌లో ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఆటో, గంజాయిని స్వాధీనం చేసుకుని కల్యాణ్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు తెలిపారు.

సర్వాయి పాపన్న ఆశయాలు కొనసాగించాలి



జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

వేలేరు : బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం గీత పారిశ్రామిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డం వీరన్నగౌడ్ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి, గీతకార్మిక సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో గౌడ, గీతకార్మికులు సొసైటీల ఆధ్వర్యంలో పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కల్లుగీత కార్మిక సంఘం పోరాటం ఫలితంగానే గీతకార్మికులకు పింఛన్లు, ఎక్స్‌గ్రేషియా పెంపు జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజేందర్‌గౌడ్, సాంబరాజు, వెంకటేశ్, సాయికుమార్, కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● మామునూరు ఏసీపీ తిరుపతి

ఐనవోలు : సైబర్ నేరాలు, డ్రగ్స్, డయల్ 100 పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మామునూరు ఏసీపీ తిరుపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే డయల్ 100కు కాల్ చేసి వివరాలు తెలుపాలన్నారు. డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల ఫోన్‌లకు స్పందించొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే సంక్షేమ పథకాలు కట్

ఆత్మకూరు : గ్రామాల్లో గుడుంబా తయారీ చేసినా, అమ్మకాలు జరిపినా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం గుడుంబా తయారీ, అమ్మకందారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడుంబా తయారీపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఎవరు అమ్మినా ఉపేక్షించేది లేదన్నారు. విక్రయదారులపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని అన్నారు. గుడుంబా విక్రయదారులు ప్రత్యామ్నాయ ఉపాధిని ఎంచుకోవాలన్నారు. దానికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, దామెర తహసీల్దార్లు జగన్‌మోహన్‌రెడ్డి, జ్యోతివరలక్ష్మిదేవి, సీఐ సంతోశ్, ఎక్సైజ్ సీఐ తాతాజీ, ఎస్ఐలు ప్రవీణ్, అశోక్, విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

దళిత కాలనీ సమస్యను పరిష్కరించాలి



బురద మయమైన రోడ్డును పరిశీలిస్తున్న సుధాకర్

శాయంపేట : మండల కేంద్రంలోని దళిత కాలనీలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని దళిత సంఘం నాయకుడు మారేపల్లి సుధాకర్ కోరారు. సైడ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం దళిత కాలనీని ఆయన సందర్శించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాలనీలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా దళిత కాలనీలు అభివృద్ధి జరిగేలా నిధులు విడుదల చేసి సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీలను నిర్మించాలని కోరారు. దోమల నివారణకు గ్రామపంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక శ్రద్ధ వహించి దళిత కాలనీలకు సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. . మారేపల్లి కమల, దైనంపల్లి పద్మ, సృజన, రమ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచాలు అందించాలి



రాజును పరామర్శిస్తున్న వీరస్వామిగౌడ్, తదితరులు

కమలాపూర్ : గీత కార్మికులకు త్వరితగతిన కాటమయ్య రక్షణ కవచాలు అందించి వారి ప్రాణాలు కాపాడాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మాదన్నపేటలో గీతకార్మికుడు తడక రాజు ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి ఎడమకాలు విరుగగా శుక్రవారం ఆయన పరామర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి 20 రోజుల క్రితం గీతకార్మికుల కోసం ప్రారంభించిన కాటమయ్య రక్షణ కవచాల కోసం మొన్నటి బడ్జెట్‌లో ఒక్కరూపాయి కేటాయించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2.30 లక్షల మంది గీత కార్మికులు ఉన్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా గీత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ గణపతిరాజుగౌడ్, హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రం సురేష్‌గౌడ్, గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు మండ రఘుపతి, ఉపాధ్యక్షుడు బండి రాజయ్యగౌడ్, నాయకులు తడక సదయ్యగౌడ్, చీకట్ల నారాయణగౌడ్, తడక రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమైనప్పుడే గుర్తింపు



రాజును సన్మానిస్తున్న మాజీ సర్పంచ్

శాయంపేట : ప్రజలతో మమేకమై పని చేసినప్పుడే అధికారులకు గుర్తింపు వస్తుందని మాజీ సర్పంచ్ ఆకుతోట రాజేశ్ అన్నారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రాయికంటి రాజు బదిలీ సన్మాన కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి రాధిక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. 11 సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శి రాజు గ్రామానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు, మరెన్నో విశిష్టమైన అవార్డులను తీసుకోవడం అతని పనితనానికి నిదర్శనమన్నారు. అనంతరం రాజును పూలమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సమ్మిరెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

చర్య తీసుకోవాలి

దామెర : మండలంలోని పెద్దాపూర్ (ఊరుగొండ) పీఏసీఎస్ సొసైటీ బ్యాంక్ అధికారులపై చర్య తీసుకోవాలని ఓ మహిళా రైతు శుక్రవారం డీసీఓకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఈ ఇలా ఉన్నాయి.. మండలంలోని దమ్మన్నపేటకు చెందిన కూతురు అనూష 2016 జనవరిలో పెద్దాపూర్ పీఏసీఎస్‌లో లోన్‌తీసుకుని అదే సంవత్సరం సెప్టెంబర్‌లో వడ్డీతో సహా మొత్తం చెల్లించి నోడ్యూ సర్టిఫికెట్ తీసుకున్నారు. అనంతరం ఏపీజీవీబీ బ్యాంక్‌లో లోన్ తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో తన పేరు రాకపోవడంతో అధికారులను సంప్రదించారు. దీంతో పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు ఏపీజీవీబీ, పెద్దాపూర్ పీఏసీఎస్ రెండు బ్యాంక్‌లో కలిపి రూ. 3 లక్షల పైచిలుకు రుణం తీసుకున్నారని, అందుకే రుణమాఫీకి అనర్హులని తెలిపారు. కాగా పెద్దాపూర్ పీఏసీఎస్‌లో లోన్ తీసుకోకున్నా ఉన్నట్లు చూపించిన పీఏసీఎస్ బ్యాంక్ అధికారులపై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో ఆమె కోరింది.

పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం



ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన కనుకుంట్ల రాజు జూలై 24వ తేదీన ప్రమాదవశాత్తు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడితో కలిసి 2009-2011 వరకు జిజ్ఞాస జూనియర్ కళాశాలలో సీఈసీ చదువుకున్న స్నేహితులు బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. రూ. 25వేల ఆర్థికసాయం అందించారు. పూర్వ స్నేహితులు కందికొండ వెంకన్న, బోయిని నరేష్, పోశాల అమర్నాథ్, బత్తిని ప్రశాంత్,, బ్యాగ భరత్, పొన్నం సంతోష్ ఉన్నారు.

విద్యార్థి చదువుకు చేయూత

నడికూడ : మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన బూర నాగచైతన్య తండ్రి ఇటీవల మృతిచెందాడు. దీంతో నాగచైతన్య చదువుకు మనుస్ హెల్పింగ్ హాండ్స్ ఫర్ ఆర్ఫాన్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ చేయూతనందించింది. అతడి చదువుకు కావాల్సిన సంవత్సరం ఫీజు రూ.12000లను తల్లి లావణ్యకు అందించారు. తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు, విద్య, వైద్యానికి తోడుగా నిలుస్తున్నట్లు తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన కలిగిఉండాలి

ఆత్మకూరు : కేన్సర్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ స్పందన అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం కేన్సర్ స్క్రీనింగ్ జరిగింది. 101మందికి వైద్య పరీక్షలు చేయగా ముగ్గురు ఓరల్‌కేన్సర్, ముగ్గురు రొమ్ము కేన్సర్, ఏడుగురికి గర్భసంచి కేన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని ఆమె తెలిపారు. మొదటి దశలోనే గుర్తిస్తే కేన్సర్‌ను దూరం చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

ఖిలా వరంగల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని 40వ కార్పొరేటర్ మరుపల్ల రవి సూచించారు. వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో బల్దియా ఆధ్వర్యంలో ప్రజలకు శుక్రవారం పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేశారు. మొక్కల సంరక్షణ బాధ్యతన్నారు.